# వైభవంగా గణేష్ నిమజ్జనం

- అంబరాన్నంటిన సంబరాలు
- ఆకట్టుకున్న కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు



బేతంచెర్లలో భారీ జనసందోహం మధ్య ఊరేగింపుగా వస్తున్న వినాయకులు

**బేతంచెర్ల:** మండల కేంద్రం బేతంచెర్ల పట్టణంలో కొలువైన వినాయకుల నిమజ్జనం గురువారం వైభవంగా జరిగింది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ గణేష్ ఉత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో పట్టణంలో 38 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో వినాయకుడి విగ్రహాలను కొలువుంచారు. నాలుగు రోజులు భక్తుల నుంచి పూజలు అందుకున్న గణనాథులను భక్తజనం సందోహం మధ్య నిమజ్జనానికి తరలించారు. ముందుగా స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద గణేష్ ఉత్సవ కేంద్ర సమితి సభ్యులు నిమజ్జనం వినాయకుల ఊరేగింపును జెండా ఊపి ప్రారంభించారు. డప్పువాయిద్యాల మధ్య పురవీధుల గుండా గణపయ్యల ఊరేగింపు సాగింది. పాతబస్టాండు, అమ్మవారిశాల, చెన్నకేశవస్వామి, గౌరిపేట, మెయిన్ బజార్, ప్రధాన రహదారవెంట గణపతి బప్పా మోరియా అంటూ, వాయిద్యాలు, బాణా సంచా పేలుస్తూ, సాంస్కృతిక కార్యక్రమాల మధ్య యువకులు కోలాహలంతో రంగులు పూసుకుంటూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కర్నూలు రహదారిలోని వినాయక ఘాట్‌లో బొజ్జగణపయ్య విగ్రహాలను నిమజ్జనం చేశారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, నంద్యాల ఎస్పీ, ఎస్టీ సెల్ డీఎస్పీ రామాంజి నాయక్, బేతంచెర్ల సీఐ ప్రియతం రెడ్డి, ఎస్‌లు శివ శంకర్ నాయక్, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, నిమజ్జనం ఉత్సవాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో కేంద్ర గణేష్ ఉత్సవ సమితి సభ్యులు హుసేన్‌రెడ్డి, మారుతి కృష్ణ, బుగ్గన చంద్ర మౌళీశ్వర్‌రెడ్డి, పుల్లారెడ్డి, అన్నారావు, నాగమోహన్, నాగేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి ,శ్రీనివాసులు పాల్గొన్నారు.

**పోటాపోటీగా సాగిన గణపయ్య లడ్డూ వేలం పాటలు**

నాలుగు రోజుల పాటు పూజలు అందుకున్న వినాయకుల విగ్రహాల వద్ద ఉంచిన లడ్డూ ప్రసాదం వేలం పాటలు పోటాపోటీగా సాగాయి. శ్రీరామ గణేష్ ఉత్సవ మండలి లడ్డూను రూ. 84 వేలకు భక్తుడు రంగు సుబ్రహ్మణ్యం పాటపాడి దక్కించుకున్నాడు. అదేవిధంగా భోళాగణేష్ లడ్డూను బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు రూ.68 వేలకు, సర్వజన గణేష్ లడ్డూ రూ. 68 వేలకు రామనాయుడు, అంగళ్ల బజారులోని వినాయకుడి లడ్డూ రూ. 56 వేలకు భక్తులు వేలం పాట పాడారు.

**బనగానపల్లెరూరల్ :** మండలంలోని పలుకూరు గ్రామంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం గణనాథుల నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలోని కాలనీలోని గణేష్ మండపాల్లో కొలువైన వినాయకుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం గణనాథులను ప్రత్యేకంగా ట్రాక్టర్ వాహనాల్లో ముస్తాబు చేసి, మేళతాళాలు, డ్రమ్ము వాయిద్యాల మధ్య గ్రామోత్సం నిర్వహించారు. గణనాథుల విగ్రహాలను బీరవోలు గ్రామ సమీపంలోని ఎస్ఆర్‌బీసీ కాల్వలో నిమజ్జనం చేశారు.



గణేషుడిని తరలిస్తున్న భక్తులు



కోలాటం మధ్య సర్వజన గణపయ్య ఊరేగింపు



పలుకూరులో నిమజ్జనం తరలుతున్న గణనాథులు

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**డోన్ టౌన్ :** మండల పరిధిలోని జగదుర్తి సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ లైన్ పనుల పనుల నిమత్తం శుక్రవారం జగదుర్తి, ఉడుములపాడు, గుంటుపల్లె, సోంపురం, తాటిమానుకొత్తూరు, అమకదాడు గ్రామాలకు కరెంటు ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయిత్రం 7గంటల వరకు కరెంటు సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు. వ్యవసాయానికి తెల్లవారు జామున 5 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా చేస్తామని చెప్పారు.

## నేడు ఆధార్ ప్రత్యేక క్యాంప్

**సంజామల:** మండల పరిధిలోని గిద్దలూరు, ముక్కమల్ల సచివాలయాల్లో శుక్కవారం ఆధార్ ప్రత్యేక క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగకుమార్ గురువారం తెలిపారు. ప్రత్యేక క్యాంప్‌లో కొత్త ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు చేస్తారన్నారు. ఒక్కరోజు జరిగే ప్రత్యేక క్యాంప్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**అవుకు:** మండల పరిధిలోని జూనూతల గ్రామానికి చెందిన చాకలి రామక్రిష్ణుడు(53) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి రామక్రిష్ణుడు ఉదయాన్నే మొబైల్‌కు చార్జింగ్ పెట్టుకోవటానికి వెళ్లి విద్యుత్ షాక్ తగలడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడని తెలిపారు.

## క్లుప్తంగా

### వ్యక్తిగత శుభ్రతను పాటించాలి

**బనగానపల్లెరూరల్ :** విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. గురువారం పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న బీసీ బాలుర, జ్యోతిరావు పూలే వసతి గృహంతోపాటు మోడల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు మాట్లాడుతూ విద్యార్థులు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ వెంకటేశ్వర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### 14,730 క్వింటాళ్ల శనగ విత్తనాలకు ప్రతిపాదనలు

**కోవెలకుంట్ల:** ఈ ఏడాది రబీ సీజన్ మొదటి పంటగా సాగు కానున్న పప్పుశనగ సాగుకు 14,730 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు పంపినట్లు ఏడీఏ సుధాకర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ జిల్లాలోని కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో ప్రతి ఏటా అధిక విస్తీర్ణంలో పప్పుశనగ సాగవుతోందన్నారు. కోవెలకుంట్ల మండలానికి 3,200 క్వింటాళ్లు, దొర్నిపాడు -1,22, ఉయ్యాలవాడ - 2,025, సంజామల - 3,950, కొలిమిగుండ్ల - 2,180 , అవుకు మండలానికి 2,155 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపామని వివరించారు. ప్రభుత్వం ధర నిర్ణయించిన వెంటనే 40 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేస్తామని వెల్లడించారు.

### గణనాథులకు ప్రత్యేక పూజలు

**కోవెలకుంట్ల:** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆయా కాలనీల్లో కొలువుదీరిన గణనాథులకు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో పాండురంగస్వామి దేవాలయం, సంతమార్కెట్, రంగరాజుపేట, సభాపతిరోడ్, రామాలయం, కుమ్మరివీధి, పెద్దమ్మగుడి తదితర 45 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో రూపాల్లో వినాయక విగ్రహాలను కొలువుంచారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. శుక్రవారం వినాయక విగ్రహాలకు వీడ్కోలు పలుకుతూ నిమజ్జనం చేయనున్నారు.

### అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

**అవుకు:** ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కోవెటకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రం అవుకులోని సాయికిరణ్ ఫర్టిలైజర్, ఫెస్టిసైడ్స్ దుకాణాన్ని ఏఓ అబ్దుల్ హక్‌తో కలిసి ఆయన తనిఖీ చేసారు. రికార్డులను,ఎరువుల, మందుల స్టాక్‌ను పరిశీలించారు. నకిలీ మందులు, ఎరువులను విక్రయించి రైతులను మోసం చేస్తే దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేస్తామని సుధాకర్ హెచ్చరించారు. తప్పక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

### ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

**డోన్ టౌన్ :** ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చేపట్టి చట్ట బద్ధత కల్పించాలని కోరుతూ ఏమ్మార్పీస్ ఆధ్వర్యంలో గురువారం పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు గుండాల ఈశ్వర్యయ్య మాదిగ మాట్లాడుతూ మాదిగలను బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు పులికేశవయ్య మాదిగ, రామాంజనేయులు, చిన్నరాయుడు, పులిపెద్దయ్య, రంగన్న, వెంకటేశు, లక్ష్మన్న, సునీల్, మాధవస్వామి తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తిపై కేసు నమోదు

**కోవెలకుంట్ల:** మండలంలోని లింగాల గ్రామానికి చెందినబాల ఉసేనిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కల్పన తెలిపారు. ఉసేని ఓ వివాహిత వెంటపడుతూ వేధింపులకు గురి చేస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### నేడు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

**డోన్ టౌన్ :** నంద్యాలకు చెందిన ఉదయానంద కార్కినోస్ క్యాన్సర్ సెంటర్ ప్రతినిధులు డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ కింద శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత కాన్సర్ స్క్రీనింగ్ హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు గురువారం ఆసుపత్రి సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు. శరీరంలో కొత్తగా ఏర్పడిన గడ్డలు, నోటిలో తెల్ల, ఎర్ర మచ్చలు, రొమ్ము,మెడలో వాపు, గడ్డలు, విపరీతమైన అలసట, ఆకలి తగ్గడం, మూత్రం, మలంలో రక్తం రావడం, పెరి మెనోపాసల్ బ్లీడింగ్ తదితర లక్షణాలు ఉన్న వ్యక్తులు ఈ పరీక్షలు చేయించుకోవచ్చు అన్నారు. ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డులతో రావాలని సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రముఖ అంకాలజీ డాక్టర్ నాగసుదర్శనరెడ్డి, జనరల్ సర్జన్ సాయిప్రణీత్‌రెడ్డి వైద్య పరీక్షలు చేస్తారన్నారు.

### ప్రజలకు అందుబాటులో ఆధార్ సేవలు

**సంజామల:** మండల కేంద్రాలకు వెళ్లకుండ గ్రామాల సచివాలయంలోనే ప్రజలకు ఆధార్ సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ముదిగేడు, నొస్సం సచివాలయల్లో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లో ప్రజలు ఆధార్ అప్‌డేట్, మార్పులు చేర్పులు చేయించుకున్నారు. 35 మంది వివిధ ఆధార్ కార్డులో వివిధ మార్పులు చేయించుకున్నారని డిజిటల్ అసిస్టెంట్స్ బాలాజీ, రాజ తెలిపారు. నెలకోసారి నిర్వహిచే ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

## నిజాయితీ చాటుకున్న నాగరాజు



హ్యాండ్ బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలను అందజేస్తున్న ఎస్ఐ కల్పన

**కోవెలకుంట్ల:** మండలంలోని రేవనూరు గ్రామ సర్పంచ్ గజ్జెల జయమ్మ భర్త నాగరాజు నిజాయితీ చాటుకున్నాడు. గురువారం రేవనూరు ఎస్ఐ కల్పన అందించిన సమాచారం మేరకు.. బిజనవేముల గ్రామానికి చెందిన షేక్ నాజియా అనే మహిళ ఆటోలో వెళ్తూతూ పట్టణ శివారులోని కుందూనది వంతెన సమీపంలో హ్యాండ్ బ్యాగ్ జారవిడుచుకుంది. అందులో ఒకటిన్నర తులం బంగారు ఆభరణాలు, మొబైల్‌ఫోన్, కొంత నగదు ఉంది. నాగరాజు కోవెలకుంట్ల నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తూ కింద పడిపోయిన హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తించాడు. బ్యాగ్‌ను రేవనూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. బ్యాగ్‌లో ఉన్న మొబైల్ ఫోన్ ఆధారంగా బాధితురాలికి సమాచారం చేరవేసి పోగొట్టుకున్న బ్యాగ్‌ను అందజేశారు. నాగరాజు నిజాయితీని ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది అభినందించారు.

### మెడికల్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

**కొలిమిగుండ్ల:** రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం సామాజిక బాధ్యత కింద గ్రామాల్లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు సూచించారు. గురువారం కల్వటాలలో కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ తదితర రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

## 108 వాహనంలో ప్రసవం

**అవుకు:** పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 అంబులెన్స్‌లో బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే ప్రసవించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. 108 అంబులెన్స్ ఈఎంటీ చంద్రనాయక్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అవుకు మండల పరిధిలోని కొండ ప్రాంతంలో ఉన్న మంగంపేటకు చెందిన గర్భిణి శివానికి బుధవారం అర్ధరాత్రి నుంచి పురిటి నొప్పులతో బాధపడుతుంది. కుటుంబ సభ్యులు సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో సమీప ఆసుపత్రికి తీసుకెళ్తుండగా నొప్పులు అధికం కావటంతో మార్గ మధ్యలోనే వాహనాన్ని పక్కకు సుఖ ప్రసవం చేశారు. రాత్రి 3.30 గంటలకు ఆడిపిల్ల జన్మించిందని, తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారన్నారు. అనంతరం చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపించాలి



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న కాటసాని ఓబులరెడ్డి

**బనగానపల్లెరూరల్:** విద్యార్థులు చదువుతో పాటు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లోనూ ప్రతిభ చూపించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబులరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని నందవరం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నియోజకవర్గస్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా హెచ్ఎం బయ్యన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఓబులరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రామస్థాయి నుంచి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ నిర్వహించి ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గస్థాయిలో ప్రతిభ చూపిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని క్రీడల పోటీల ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులకు భోజన వసతి సౌకర్యం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పీఆర్ వెంకటేశ్వరరెడ్డి కల్పించారు. కార్యక్రమంలో బనగానపల్లె, అవుకు మండలాల ఎంఈఓలు స్వరూప, శ్రీధర్‌రావు, సర్పంచ్ ఖైరున్‌బీ, విద్యాకమిటీ చైర్మన్ వడ్డె గోగుల రమణ తదితరులు పాల్గొన్నారు.

## నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు



గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

**డోన్ టౌన్ :** సమాజంలో మూఢనమ్మకాలను రూపుమాపిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. గురజాడ 162వ జయంతిని పురస్కరించుకుని పాతపేట హైస్కూల్లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ సేవలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవేంద్రప్ప, శివప్రసాద్, సుబ్బారెడ్డి, రవిశేఖర్, రాధ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

- స్థానిక నెహ్రూనగర్ కాలనీలోని స్కూల్లో హెచ్ఎం లక్ష్మమ్మ, సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని ఆయ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురజాడ అప్పారావు జీవిత చరిత్రను వారు విద్యార్థులకు వివరించారు.

# అంతెందుకు... బహిరంగ చర్చకు రండి!

- డోన్ అభివృద్ధి చెందలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం
- టీడీపీ నాయకులు ఇప్పటికైనా ప్రచారార్భాట విమర్శలకు స్వస్తి చెప్పాలి
- మల్లెల రాజశేఖర్, సుబ్బారెడ్డికి సవాల్ విసిరిన వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు, చిత్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

**డోన్ :** టీడీపీ నాయకులు ఉనికిని కాపాడుకునేందుకు చేస్తున్న ప్రచారార్భాట విమర్శలకు ఇప్పటికైనా స్వస్తి చెప్పాలని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు సూచించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 77 చెరువులను హంద్రీనీవా ప్రధాన కాల్వ నీటితో నింపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని సైతం వక్రీకరిస్తూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, డోన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి వ్యంగంగా విమర్శలు చేయడం హేయమని ధ్వజమెత్తారు. అభివృద్ధి అనే ఊసే లేదని మాట్లాడుతారా... అంతెందుకు డోన్ నియోజవర్గంలో జరిగిన అభివృద్ధితోపాటు చెరువులకు నీటి నింపే కార్యక్రమంపై బహిరంగ చర్చకు రండి... తెల్చుకుందాం అని సవాల్ విసిరారు. టీడీపీ నాయకులు డోన్ అభివృద్ధి చెందలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తామని స్పష్టం చేశారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో గురువారం ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోసప్రసాద్, నాయకులు ఆర్ఈ రాజవర్దన్, చిరంజీవి, యాపదిన్నె నరసింహారెడ్డి, మహేశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కురుకుంద హరితో కలిసి నిర్వహించిన విలేరకరుల సమావేశంలో శ్రీరాములు మాట్లాడారు. ఇరిగేషన్ శాఖపై కనీస అవగాహనలేని అజ్ఞానుల్లా మాట్లాడడం టీడీపీ నాయకులకే చెల్లిందన్నారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో హంద్రీనీవా కాలువ నుండి చెరువులకు నీరు మళ్లించేందుకు ఒక్క కిలో మీటర్ పైపులైన్ అయినా వేశారా... గంప మట్టి పైపులైన్‌పై వేసి పూడ్చారా అని నిలదీశారు. కాగితాలకే పరిమితమైన ఈ చారిత్రాత్మకమైన ప్రాజెక్టు అమలుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. సాక్షాత్తూ సీఎం చేతుల మీదుగా ప్రారంభింపజేసి కరువు ప్రాంతాల బీడు భూములను సస్యశ్యామలం చేసిందేకు మంత్రి బుగ్గన అంకితభావంతో కృషి చేస్తే కేవలం ఉనికిని కాపాడుకునేందుకు వ్యంగంగా విమర్శలు చేస్తారా అంటూ ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాల వర్తింపు, విద్యా, వైద్యరంగాల అభివృద్ధి తదితరాలు ఎన్నో ఉన్నాయని, అయినా అర్థం లేని విమర్శలు తగవన్నారు.

**సీఎం సభకు వరదలా ప్రజాభిమానం..**

**ఓటమి భయంతోనే టీడీపీ అసత్యారోపణలు**

డోన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఊహించని విధంగా ప్రజలు తరలివచ్చారని, ప్రజాభిమానం వరదలా పొంగిందని శ్రీరాములు స్పష్టం చేశారు. ఈ జన ప్రభంజనాన్ని చూసి భయపడిన టీడీపీ నాయకులు 2024 ఎన్నికల్లో మళ్లీ ఓటమని తప్పదని ఊహించి అర్థరహిత విమర్శలకు పాల్పడుతూ ఉనికిని కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రజల వద్దకే పాలన సాగిస్తూ... పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తూ సీఎం జగనన్న ప్రజాభిమానాన్ని పొందారన్నారు. టీడీపీ మద్దతుదారులకు కూడా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రాజకీయంగా మాట్లాడండి... సమస్యలను ఎత్తి చూపండి... స్వీకరిస్తాం.. పరిష్కారానికి చర్యలు కూడా తీసుకుంటాం. అంతేగాని డోన్ ఏ మాత్రం అభివృద్ధి జరగలేదంటే మాత్రం సహించమని... దమ్ముంటే బహిరంగ చర్చకు వచ్చి నిరూపించుకోవాలని శ్రీరాములు మరోమారు సవాల్ విసిరారు.

**సీఎంను విమర్శించే స్థాయా... మీ అర్హతేంటి?**

చెరువులను నింపి... తాగు, సాగు నీటిని అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుడితే... సిగ్గులేని సామెతలతో వమిర్శిస్తారా... అసలు మీ అర్హతేంటి అని శ్రీరాములు నిలదీశారు. సీఎంతోపాటు మంత్రి బుగ్గనను విమర్శించే స్థాయి మీకు ఉందా అని మల్లెల రాజశేఖర్, ధర్మవరం సుబ్బారెడ్డి తీరుపై విమర్శలు గుప్పించారు. దిగజారుడు విమర్శలు చేసారు కాదా... దమ్ము, ధైర్యం ఉంటే డోన్ అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని సవాలవిసిరారు. మల్లెల రాజశేఖర్‌కు రాజకీయ భిక్ష పెడితే... టీడీపీ పంచన చేరి నేడు ఏదో సాధించామనే విర్రవీగుతున్నాడని, ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారనేది గుర్తుంచుకోవాలన్నారు. ఇక వార్డు మెంబర్‌గా కూడా గెలువని ధర్మవరం సుబ్బారెడ్డి స్థాయి ఏంటి... నీ కుట్రలు డోన్ ప్రజలకు తెలియవా... అని ఎద్దేవా చేశారు. నమ్మినవారిని తొక్కుతూ అక్రమాలతో డబ్బు సంపాదించిన విషయాన్ని గుర్తించుకోవాలని హెచ్చరించారు. ఒకనాడు టీడీపీ... మళ్లీ వైఎస్సార్‌సీపీ...ఆ తర్వాత కాంగ్రెస్, మళ్లీ టీడీపీలోకి వచ్చావు... ఊసరవిల్లిలా రంగులు మార్చుతూ ఏ పార్టీలో ఉన్నా నమ్మినవారిపై ఓ పథకం ప్రకారం ఏమీ తెలియనట్లే ఉంటూ తప్పుడు కేసులు బనాయించి పబ్బం గడిపిని నీ చరిత్రను నీవే మరిచిపోతే ఎలా సుబ్బారెడ్డీ అని ఎద్దేవా చేశారు.

## యువకుల మధ్య ఘర్షణ

**డోన్ టౌన్ :** పట్టణంలోని ఇందిరానగర్, తారక రామ నగర్ మధ్య భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం మధ్యాహ్నం నడిరోడ్డుపై యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బుధవారం వినాయక నిమజ్జనం సందర్భంగా కొండపేట, తారకరామనగర్ కాలనీ యువకుల మధ్య తలెత్తిన వివాదం ఈ ఘర్షణకు దారితీసినట్లు తెలిసింది. ఈ చిన్న వివాదంతో యువకులు అధిక సంఖ్యలో గుమి కూడి క్రికెట్ బ్యాట్లు, రాడ్లు, కర్రలతో సినిమాను తలిపించేలా నడి రోడ్డులో దాడి చేసుకోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం ఘర్షణ జరిగిన సంగతి వాస్తవమేనని, ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. రాజీకి ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందని చెప్పారు.

# ప్రజల సమస్యలపై స్పందించండి

- ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

**అవుకు:** ప్రజల సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కార చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి సూచించారు. మండల కేంద్రం అవుకు ఎంపీడీఓ కార్యాలయ భవనంలో మండలస్థాయి అధికారులతో ఎంపీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు...పురోగతిపై చల్లా ఆరా తీశారు. అధికారులు నిర్లక్ష్యం వీడి సమన్వయంతో ముందుకు సాగాలని, అభివృద్ధి పనులు చురుగ్గా సాగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి రూ. వేల కోట్లు ఖర్చు చేస్తుందని, సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పార్టీలు, కులాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందజేయాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కార మార్గాలు చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏడీఏ సుధాకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఓ అబ్దుల్ హక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరిముల్లా, ఎంఈఓ-2 వెంకటేశ్వరరెడ్డి, ఏపీఓ అనీఫా, ఏపీఎం విజయగోపాల్, ఐసీడీఎస్ సైపర్‌వైజర్ శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భూసమస్యలకు శాశ్వత పరిష్కారం

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

**కొలిమిగుండ్ల:** దశాబ్దాలుగా నెలకొన్న రైతుల భూసమస్యలకు దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపడంతో రైతుల్లో ఆనందం నెలకొందని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. జగనన్న భూహక్కు-భూరక్ష సర్వే పూర్తి అయిన కొలిమిగుండ్ల, మీర్జాపురం గ్రామాల రైతులకు గురువారం స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్‌తో కలిసి జెడ్పీ చైర్మన్ భూహక్కు పత్రాలను రైతులకు అందజేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతు బ్రిటిష్ కాలంలో మన్రో చేసిన రికార్డులే ఇప్పటికి ఉండటంతో రైతులు భూవివాదాలతో చాలా ఇబ్బందులు పడుతుండేవారన్నారు. అందరికీ సమన్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈపథకం ద్వారా భూసమస్యలకు ఫుల్‌స్టాప్ పెట్టారన్నారు. రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో ఒక్క పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే సర్వే చేయించి, సరిహద్దు రాళ్ల ఏర్పాటుతో పాటు హక్కు పత్రాలు అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సరిత, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, రెవిన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**డోన్ రూరల్ :** మండల పరిధిలోని ఎస్. గుండాల గ్రామంలో గురువారం తహసీల్దార్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో రైతులకు జగనన్న భూ హక్కు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న భూ రక్ష పథకం కింద ఎస్.గుండాల రెవెన్యూ గ్రామునకు ఫేస్-2 కింద రీసర్వే చేయడం జరిగిందన్నారు. గ్రామంలో 324 మందికి భూహక్కు పత్రాలను అందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గిడ్డారెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌రాజా, మండల సర్వేయర్ జగదీష్, వీఆర్ఓ గోవిండ్, రాజు, గ్రామ సర్వేర్లు హరికృష్ణ, గంగాధర్‌లు పాల్గొన్నారు.

**బనగానపల్లెరూరల్ :** మండలంలోని మీరాపురం గ్రామంలో వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూ రక్ష పథకం కింద డిజిటల్ సర్వే వంద శాతం పూర్తి కావడంతో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను గ్రామానికి చెందిన యాగంటి ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తోటబుచ్చిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో 200 మంది రైతులకు సంబంధించి రైతుల అంగీకరం మేరకు భూ సర్వే పూర్తి చేయడం జరిగిందని, ప్రస్తుతం 60 పాసు పుస్తకాలు రావడంతో రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్ఓ కుళ్లాయి, పంచాయతీ కార్యదర్శి ప్రకాశం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన దిగుబడులు రాబట్టాలి



కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్

**అవుకు:** రైతులు ఉత్తమ వ్యవసాయ పద్ధతులు పాటిస్తే నాణ్యమైన దిగుబడులను రాబట్టవచ్చని కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్ పేర్కొన్నారు. గురువారం అవుకు గ్రామంలో ఏఓ అబ్దుల్ హక్‌తో కలిసి పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే సుడిదోమ లక్షణాలను ఎలా గుర్తించాలి, వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. అదేవిధంగా పంట నమోదు ప్రక్రియ, ఈకేవైసీలు ఎంత వరకు పూర్తయ్యాయని ఆరా తీశారు. రైతులకు ప్రభుత్వం అందించే వ్యవసాయ సంబంధిత పథకాలకు అర్హత ఉండాలంటే తప్పనిసరిగా పంటను నమోదు చేసి, ఈకేవైసీ తీసుకోవాలన్నారు. రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కళ్యాణ్ కుమార్, వీఏఏలు సింధియా, రాజేష్, ఉమాదేవి పాల్గొన్నారు.

## బహుమతులు అందజేత



వెండి గిన్నె అందజేస్తున్న రామచంద్రారెడ్డి

**బనగానపల్లె :** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా స్థానిక పెండేకంటినగర్ కాలనీలో గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బెడదల రామచంద్రారెడ్డి కుమారుడు దివంగత సందీప్‌కుమార్‌రెడ్డి జ్ఞాపకార్థం ఈ ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరచిన మహిళలకు వెండి గిన్నెలు అందజేశారు. లక్ష్మీకళావతికి మొదటి బహుమతిగా రూ.6116, రెండవ బహుమతిగా సువర్ణకు రూ.3116, మూడవ బహుమతిగా రామలక్ష్మికి రూ.2116ల విలువ వెండి గిన్నెలను రామచంద్రారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, యాగంటి ఆలయ మాజీ చైర్మన్ దొనపాటి యాగంటిరెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.